క్లుప్తంగా

ఆర్టీసీ సేవలు విస్తరించండి

డయల్ యువర్ డీఎంలో ప్రయాణికుల వినతి

కాకినాడ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని, ఆర్టీసీ సేవలను విస్తరించడం ద్వారా ఆయా రూట్లలో బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు. గురువారం కాకినాడ ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డిపో మేనేజర్' నిర్వహించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ ఫోన్ ద్వారా ప్రయాణికుల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సామర్లకోట బళ్లమార్కెట్, విఘ్నేశ్వర టాకీస్, మెహర్ కాంప్లెక్స్, బ్రౌన్‌పేట ప్రాంతాల్లో బస్‌స్టాప్‌ల వద్ద సమయ వేళలు ఏర్పాటు చేయాలని, సామర్లకోట–పిఠాపురం బస్సును పెద్దాపురం వరకు పొడిగించాలని కోరారు. తుని–కాకినాడ బస్‌ల సమయవేళలను పునః సమీక్షించాలని దుర్గాడకు చెందిన శివకోటి బాబురావు కోరారు. కాకినాడ–జి.మామిడాడ మధ్య బడిబస్సులను తిప్పాలని ప్రయాణికుడు అహ్మద్ విజ్ఞప్తి చేశారు. పిఠాపురం–ఏలేశ్వరం మధ్య బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికుడు జె.వెంకటేశ్వరరావు కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎం మనోహర్ తెలిపారు.

ఉపకరణాల పంపిణీకి వైద్య పరీక్షలు

బాలాజీచెరువు: సమగ్రశిక్ష, సహిత విద్య విభాగంలో ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ నిమిత్తం గురువారం కాకినాడ భవిత సెంటర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకూ గల పిల్లలకు నిర్ధారణ నిమిత్తం ఆర్థోపెడిక్, అప్తమాలజిస్ట్, ఈఎన్‌టీ, సైకియాట్రిస్ట్ వైద్యులు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కాకినాడతో పాటు కాజులూరు, తాళ్లరేవు, కరప, పెదపూడి, కాకినాడ రూరల్‌కు సంబంధించి పాల్గొన్నారని సహిత విద్య కో–ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు తెలిపారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

ఈఆర్వో వెంకటరావు



కాకినాడ: సిటీ నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులకు ఎన్నికల విధులపై గురువారం సాయంత్రం శిక్షణ ఇచ్చారు. సిటీ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడుగురు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగం, పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియపై ఇచ్చిన శిక్షణను సంపూర్ణ అవగాహన చేసుకుని ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సెక్టార్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్వో సూచించారు.

నాణ్యమైన సేవలతో రోగులకు ప్రయోజనం : డీఎంఈ

కాకినాడ క్రైం: రాష్ట్ర డీఎంఈ (అకడమిక్) డాక్టర్ రఘునందన్ గురువారం కాకినాడ జీజీహెచ్‌ను సందర్శించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. సదరు విభాగాల హెచ్‌వోడీలతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీఎం గ్యాలరీలో జరిగిన సమావేశంలో హెచ్‌వోడీలు తమ విభాగాలకు సమకూర్చాల్సిన పరికరాలు, సదుపాయాలను వివరించారు. డీఎంఈ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

కూటమి అభ్యర్థి ప్రచారం

కరప: గ్రామ శివారు రామకంచిరాజు నగర్ కాలనీలో గురువారం నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, నాయకులు, కార్యకర్తలతో కల్సి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సువిధతో 24 గంటల్లో అనుమతులు

- జిల్లా ఎన్నికల అధికారి కృతికా శుక్లా
- వివిధ రాజకీయ పార్టీలతో సమీక్ష



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ సిటీ: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి అవసరమైన అన్ని అనుమతులను సువిధ యాప్ ద్వారా 24 గంటల్లో మంజూరు చేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్, ఓటర్ల జాబితా, ఫారం 6, 7, 8 లకు సంబంధించి దాఖలైన దరఖాస్తుల పరిష్కారం, ఈ–ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీప్యాడ్స్ వినియోగంపై ప్రజలకు అవగాహన, స్ట్రాటజీ పాయింట్, కౌంటింగ్ కేంద్రాలు, కంట్రోల్ రూములు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి అంశాలపై వారితో చర్చించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి 22 నాటికి మొత్తం 16,14,198 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం, వివిధ అనుమతులను సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ యాప్‌లో నమోదైన దరఖాస్తులను పరిశీలించి 24 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కోడ్ అమలుకు జిల్లాలో సీ విజిల్, పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటస్టిక్స్ సర్వేలెన్స్ ఇతర బృందాలు నిత్యం పర్యవేక్షణలో ఉంటాయన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులపై నమోదైన కేసులు, వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేశామన్నారు. సమావేశంలో డీఆర్వో డి.తిప్పేనాయక్, డీఎస్పీ కె.హనుమంతరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, కె.గంగాధర్, సబ్బారపు అప్పారావు, ఎన్‌వీవీ సత్యనారాయణ, కె.వీరబాబు, ఎన్నికల విభాగం అధికారి ఎం. జగన్నాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

విజయానికి అభయమివ్వు స్వామీ

- ఆలయాల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి పూజలు
- కుటుంబ సమేతంగా హాజరై ప్రార్థనలు
- ముహూర్తంతో ప్రచారానికి సమాయత్తం



ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ప్రజల ఆదరాభిమానాలతో నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా.. మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు మరింత సేవ చేయాలని ఆశిస్తున్నా.. ఆ ఆకాంక్ష నెరవేరి ఎమ్మెల్యేగా గెలుపొందేలా ఆశీర్వదించమంటూ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. సతీమణి మహాలక్ష్మితో కలిసి ఉదయం 9.28 నిమిషాలకు ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఆలయాలను దర్శించారు. తొలుత జయేంద్రనగర్‌లోని వినాయక ఆలయం, సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం, వెంకట్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం, సూర్యారావుపేటలోని త్రిపురసుందరి ఆలయాలకు వెళ్లి అక్కడ సతీసమేతంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు చోట్ల పట్టు వస్త్రాలతో పాటు ఎన్నికల ప్రచారం కోసం రూపొందించిన కరపత్రాలను కూడా ఉంచి భగవంతుని ఆశీస్సులు కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక కాగలనన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గడచిన ఐదేళ్లలో కాకినాడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్టు వివరించారు. చేసిన అభివృద్ధి, ప్రజల ఆశీస్సులతో మరోసారి విజయం తనదేనన్నారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పరితపించే సీఎం జగన్‌తో పాటు ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలను కోరారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కరప గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పలువురు ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు నాగల బాలాజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో గురువారం చేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన గుత్తుల రవి, సత్తిబాబు, మోషే, తదితరులు చేరడంతో వారికి పార్టీ కండువాలు వేసి వైస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల మద్దతు వైఎస్సార్ సీపీకే

- ఆ వర్గం రాష్ట్ర నేత, ఎమ్మెల్సీ కుడుపూడి హామీ



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

కాకినాడ: రానున్న ఎన్నికల్లో శెట్టిబలిజల తరపున తమ మద్దతునిస్తామని ఉభయరాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఎమ్మెల్యే ద్వారంపూడికి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం ఆయన ద్వారంపూడి నివాసానికి వచ్చి మాట్లాడుతూ సీఎం జగన్ శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇక్కడ సముచిత ప్రాధాన్యం కల్పించారని, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 630 గజాల స్థలాన్ని మంజూరు చేయించడంతోపాటు రాజకీయంగా కూడా ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. శెట్టిబలిజలకు రాజ్యసభను కేటాయించడంతోపాటు తమ సామాజికవర్గ అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించారన్నారు. అందువల్ల సీఎంగా వైఎస్ జగన్, ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యేగా చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను గెలిపించుకుంటామన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ గతంలో కూడా శెట్టిబలిజ సామాజికవర్గం తనకు అండగా నిలిచిందని, రానున్న ఎన్నికల్లో కూడా ఇదే సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుడుపూడి వెంట పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట



తమకు లభించిన అవార్డులను చూపుతున్న లయన్స్ విజన్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్‌కు ఆ సంస్థ ప్రాంతీయ సదస్సులో పలు పురస్కారాలు లభించాయి. క్లబ్ అధ్యక్షురాలు ఎంవీఎస్ఎల్ ప్రసూన మాట్లాడుతూ సామర్లకోటలో జరిగిన లయన్స్ ప్రాంతీయ సదస్సులో రీజియన్ చైర్మన్ సీహెచ్ శ్రీదేవి చేతుల మీదుగా 16 పురస్కారాలు అందుకున్నామన్నారు. రీజియన్ పరిధిలో ఉత్తమ క్లబ్‌గా తనకు పురస్కారం లభించడం గర్వకారణమన్నారు. ఉత్తమ క్లబ్, అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, ఉత్తమ సేవా కార్యక్రమాలకు ఈ పురస్కారాలు లభించాయన్నారు. ఈ ఏడాది తమ క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. ఈ ప్రాంతీయ సదస్సులో తమ క్లబ్ కార్యదర్శి ఎస్.శ్రీదేవిరెడ్డి, కోశాధికారి బి.శ్రీవాణి, సభ్యులు ఎం.రమాసుందరి, సీహెచ్ విజయలక్ష్మి ఎం.మీనాక్షి పాల్గొన్నారు.

జీజీహెచ్ ఉద్యోగుల జేఏసీ ఆవిర్భావం

- చైర్మన్‌గా పాలపర్తి మూర్తిబాబు



చైర్మన్ పాలపర్తి మూర్తిబాబు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 2000 మంది వైద్యులు, సిబ్బందితో గురువారం జీజీహెచ్ ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆవిర్భవించింది. స్థానిక ఎన్‌జీవో హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గం నియామకమైంది. చైర్మన్‌గా మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వివిధ క్యాడర్లలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు బేసిస్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా జేఏసీలో భాగమయ్యారన్నారు. ఆసుపత్రి ఉద్యోగుల సమస్యలపై పోరాడేందుకు, హక్కుల సాధనకు ఈ జేఏసీ ఆవిర్భవించిందని మూర్తిబాబు అన్నారు. స్థూలంగా ఉద్యోగుల సంక్షేమం, భద్రత తమకు ముఖ్యమన్నారు. నిబద్ధతతో కూడిన విధి నిర్వహణ వల్ల ఉద్యోగి గౌరవం పెరగడంతో పాటు, రోగులకు అందించే సేవల్లో నాణ్యత మరింత మెరుగవుతుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు, అధికారుల మధ్య సమన్వయం ఆసుపత్రి అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. జేఏసీ కన్వీనర్‌గా ఏపీ ఎంఈయూ జీజీహెచ్ కాకినాడ అధ్యక్షుడు కట్టిమేను మోహనరావు, జేఏసీ గౌరవ అధ్యక్షుడిగా రాష్ట్ర డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జయదేవ్ సహా వివిధ కేడర్లలో పనిచేస్తూ తమ సంఘాలలో గౌరవ హోదాలలో కొనసాగుతున్న పలువురు నాయకుల్ని అధ్యక్ష, కార్యదర్శులుగా, కో–చైర్మన్, వైస్ చైర్మన్, జాయింట్ కన్వీనర్లుగా నియమించామన్నారు. 25 మందితో జేఏసీ కార్యవర్గ కూర్పు జరిగిందని మూర్తిబాబు తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన ఏపీ ఎన్‌జీవో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ ఏపీ ఎన్‌జీవో తరపున జేఏసీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ జీజీహెచ్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు కీలకం

- డిజైన్ ఇన్నోవేషన్ డైరెక్టర్ గోపాలకృష్ణ
- ముగిసిన ఇన్నోవేషన్ ఫెయిర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ గోపాలకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి జీవితంలో నూతన ఆవిష్కరణలు కీలకమని, ఆ దిశగా విద్యార్థులు ఆలోచించాలని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో రెండు రోజులుగా నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్–24 ప్రాజెక్టుల ప్రదర్శన గురువారం ముగిసింది. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గెలుపు ఓటములతో సంబంధం లేకుండా తమకు ఉన్న ఆలోచన సమాజ ప్రయోజకరంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రాజెక్టు రూపంలో ప్రదర్శించడానికి రావడం సంతోషమని, అంతేగాక విద్యార్థుల మధ్య అభిప్రాయాలు పంచుకోవడంతో పాటు జూనియర్లకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన తరువాత కొలువులే ప్రామాణికం కాకుండా స్టార్టప్ దిశగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిభ చూపిన మొదటి మూడు ప్రాజెక్టులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు బహుమతులు అందజేయగా మరో ఆరు ప్రాజెక్టులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు పి.కిషోర్‌కుమార్, డాక్టర్ జగన్‌మోహన్, జి.కిరణ్‌కుమార్,

విజేతలు వీరే..

ప్రథమ స్థానం పొందిన ప్రాజెక్టు..
ఆటో మేటిడ్ సిమ్ స్లాట్: మొబైల్ మెరుగుపరచడంతో పాటు ఎజక్షన్ సిస్టమ్, అథెంటికేషన్
విద్యార్థుల బృందం..
బి.గ్రేసి, ఎల్.మనీషా, లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాల
ద్వితీయ స్థానం..
హైబ్రిడ్ కన్వర్టిబుల్ స్మార్ట్ బెడ్.
సౌకర్యవంతంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి దోహదపడే విధంగా పడక ఏర్పాటు..
విద్యార్థుల బృందం..
ఎండీ.సయ్యద్. పి.సందీప్. కె.సతీష్. వీఆర్ సిద్ధార్థ కళాశాల
తృతీయ స్థానం..
తక్కువ ధరలో ఇకో ఫ్రెండ్లీ ఈ– సైకిల్
విద్యార్థుల బృందం..
కేఎల్ఎస్ కృష్ణ, పి.సత్యప్రియ, ఎస్.తులసీరాజ్, ఇ.నిస్కలరాజ్. బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల

రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా శిష్టా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. రోటరీ హాల్లో గురువారం నిర్వహించిన సమావేశానికి రోటరీ ఎలక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజ సేవకు అత్యున్నత వేదిక రోటరీ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను సకాలంలో అందించేందుకు రోటరీ చేస్తున్న కార్యక్రమాలు యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా ఉందన్నారు. నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ రోటరీ గోల్డెన్ జుబ్లీ క్లబ్ గౌరవాన్ని పెంచేలా క్లబ్ పూర్వ అధ్యక్షుడు, సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. సమాజ అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్‌ను పలువురు సభ్యులు అభినందించారు.

కాలువగట్టు కష్టాలు తీరె..

- రూ.80 లక్షలతో రోడ్డు ఆధునీకరణ
- ఎమ్మెల్యే కన్నబాబు చొరవపై రైతుల హర్షం



ఆధునీకరించక ముందు కాలువగట్టు రోడ్డు దుస్థితి



ఆధునీకరించిన అనంతరం ఇలా..

కరప: రెండు మండలాలను అనుసంధానం చేసే కాలువగట్టు రోడ్డుకు మోక్షం కలిగింది. వాకాడ గ్రామం నుంచి కూరాడ వెళ్లేందుకు కాలువగట్టుదారే దగ్గరగా ఉంటుంది. కూరాడ గ్రామస్తులు వాకాడ వెళ్లాలన్నా, రైతులు పొలాలకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు ఈ దారే ఆధారం. అలాగే వాకాడ, పెదకొత్తూరు, వేములవాడ గ్రామస్తులు కూరాడ వెళ్లాలన్నా, అటు పెదపూడి మండలం కాండ్రేగుల, సంపర, జి.మామిడాడ గ్రామాలకు వెళ్లాలన్నా కాలువగట్టు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. కాలువగట్టు దారి గోతులపడి అధ్వానంగా తయారై నానా యాతన పడుతున్నారు. 2019 ఎన్నికల ముందు టీడీపీ నాయకులు ఉత్తుత్తి శంకుస్థాపనలతో ఆశలు రేకెత్తించి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూరాడ మాజీ సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, వాకాడ సర్పంచ్ అడబాల సత్య, ఎంపీటీసీ సభ్యుడు చక్కపల్లి ఫకీర్రావు, అడబాల ప్రసాద్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలసి సమస్య వివరించడంతో ఆయన రూ.80 లక్షలు మంజూరు చేసి కాలువగట్టురోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయించారు.

కన్నబాబు మేలు గుర్తుండిపోతుంది



కాలువగట్టురోడ్డు వేయాలని టీడీపీ హయాంలో ఎన్నిసార్లు అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కన్నబాబు తారురోడ్డు వేయించారు. రెండు గ్రామాలవారు ఆయన మేలును మరచిపోరు.

– అడబాల ప్రసాద్, వాకాడ

ఎమ్మెల్యే చొరవతో ఆధునీకరణ



సంపరబోది కాలువగట్టు ద్వారానే కూరాడ, వాకాడ గ్రామస్తులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. టీడీపీ వారు నిర్లక్ష్యం చేసిన ఈ రోడ్డు ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో ఆధునీకరణకు నోచుకుంది.

– రావుల ప్రసాద్, రైతు, పీఏసీఎస్ చైర్మన్, కూరాడ

ఎన్నికలకు 'కంట్రోల్ రూమ్'

ఆర్వో వెంకటరావు వెల్లడి



సిటీ నియోజకవర్గానికి సంబంధించిన కంట్రోల్ రూమ్, సిబ్బంది

కాకినాడ: ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. మిలిటరీ రోడ్ శారదాదేవి ఆలయ ప్రాంతంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న రజక కమ్యూనిటీ హాల్ భవనంలో ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటయిందన్నారు. 24 గంటలూ నిరంతరాయంగా పనిచేసేలా మూడు షిఫ్టులలో 12 మంది ఉద్యోగులు ఈ కంట్రోల్ రూమ్‌లో పని చేస్తారన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు, సమస్యలు ఉంటే ప్రజలు ఈ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చునన్నారు. కంట్రోల్ రూమ్ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884–2349400కు సమాచారం అందజేయవచ్చునని ఆయన సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టవంతంగా అమలు చేసేందుకు ప్రజలు సహకరించాలని ఆర్వో కోరారు.